# భగ్నహృదయం

యం. యస్. చలం

వసంతోదయము. కవికుమారుడు ఒళ్లు విరిచి ఆవులించి, ప్రక్కనుండి మేలుకున్నాడు. కిటికీగుండా ప్రకృతివంక కలియ జూశాడు. సూర్యోదయమయింది; ఎప్పటివలె కాదు—క్రొత్త తేజస్సుతో! పువ్వులతో నిండిన వేపవృక్షం సువాసనాభరితమైన వాయువును వీచింది. కోయిలలు గొంతెత్తి కూస్తున్నై.

రెండేళ్లుగా కవి కుమారుని హృదయ పీఠాన్ని అలంకరించిన వకుళాదేవి ఒక్కసారి స్మృతి పథానికి వచ్చింది.

తాను యింతవరకూ ఎందరో స్త్రీలను చూసి వున్నాడు. కాని ఏఒక్కరూ తన మనస్సుని యింతగా ఆకర్షించి పరితపింప చేయలేదు.

ఆ విశాలమైన నేత్రాలు, నల్లత్రాచులాంటి వాలుజడ, గుప్పిటలో బంధింపబడగల లేత కౌను; ఘనమైన జఘనము, అర్ధచంద్రాకృతిని బోలిన ఫాలభాగము. పసిడికాంతినీను శరీరము అన్నిటినీమించి-ఆనాటి సభలో తన గీతముల నామె పాడినప్పుడు ఆ సంగీతమాధుర్యం-ఒక్కసారి కన్నులకు కట్టినట్లయింది.

ఈ ఆలోచనలతోపాటు యింతవరకూ తన ఆశయాన్ని ఆమె ముందువెళ్లి గ్రక్కడానికి అడ్డుపడే పిరికితనానికి స్వస్తి చెప్పాలనే నిశ్చయానికి వచ్చాడు.

ఆసాయంత్రము ఫలాహారానంతరము అతడు వకుళయింటికి బయలుదేరాడు. ఆమె దొడ్డిలో మల్లెపొదచెంత కూర్చుని వీణారవంలో శృతి కలిపి పాట పాడుతోంది. ఆ శ్రావ్యమైన సంగీతానికి ప్రక్కనున్న అరటిచెట్లు తలలూపుతున్నై, అతని రాకతో ఆమెపాట ఆపివేసింది.

'ఆపివేశారెందుకు? పాడండి' అంటూ అతడు ఆమెకు కొద్దిదూరంలో కూర్చున్నాడు. ఆమె మళ్లీ అందుకుని మిగిలిన పాటను పూర్తి చేసినది.

సంభాషణకు పూర్వము ఏర్పడే మౌనకాలం గడిచాక అతను ప్రస్తావన ప్రారంభించాడు.

'వకుళాదేవీ! ఎంతోకాలమునుంచీ మీకీవిషయాన్ని తెలియచేద్దామనుకుంటున్నాను.'

'అంత దాచిదాచి చెప్పబోయే ఆ విషయము ఏమిటో?'

'ఏదో మహత్తరశక్తిచేత మీరు నన్ను ఆకర్షిస్తున్నారు.'

'అది సహజమేగా!'

'అంటే!'

'స్త్రీ పురుషుణ్ణి ఆకర్షించడమనేది.'

అతడు ఆశ్చర్యపోయాడు. ఆమె నోటినుంచి యింత స్పష్టమైన సంభాషణ వినగలుగుతానని అతను అనుకొని వుండలేదు.

మళ్లీ అన్నాడు. 'మీ హృదయంలో నాకు స్థానమువుంటే ధన్యాతి ధన్యుణ్ణి.'

'అందు కభ్యంతరమేముంది. మీ కోర్కె నిరాకరించేంత కాఠిన్యం నాలోలేదు.'

అతడు సంతోషంతో వుప్పొంగి; ప్రఫుల్లవదనముతో 'మరి మన వివాహము యెప్పుడు?' అన్నాడు.

'ఓహో! అదా మీవుద్దేశం నన్ను పెళ్ళాడితేగాని మీ స్వంతహక్కుగా ఉపయోగించుకుందుకు వీలులేదన్న మాట! నేను పెళ్లాడి ఒకరిహక్కు భుక్తంలో వుండవలసిన అవుసరం ఏమీలేదు. ఈ విషయములో మీ కోర్కెను శిరసావహించలేనందుకు క్షమించండి' అంటూ ఆమె చరచరా వెళ్ళిపోయింది.

అతడు స్తబ్ధుడైపోయారు. హృదయస్పందన ఆగినట్లనిపించింది. కట్టిన ఆశాసౌధం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. నీచాతి నీచాభిప్రాయంగల స్త్రీనా తనుయింత గాఢంగా ప్రేమించింది. మేడిపండుయొక్క ఆకర్షణకే నా తను భ్రమించింది. భగ్నహృదయంతో సృష్టికర్తను ఉద్దేశించి అన్నాడు. "ఓయి బ్రహ్మదేవుడా! సమస్త సుగుణాలనూ ఏవ్యక్తిలోనూ చూసే అవకాశంలేదా? అదేనా నీవిచిత్ర కల్పన?"

కొద్దిరోజులలో కవికుమారుని హస్తంనుండి "భగ్నహృదయం" అనే వుద్గ్రంథం వెలువడింది. ఒకమహత్తర గ్రంథోత్పత్తికి వకుళమార్గదర్శిని అయింది!